

వైవీయూలో విద్యార్థిని ఆత్మహత్య

వైవీయూలో మంగళవారం మధ్యాహ్నం పీజీ బయోటెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎస్. షమ్మా సుల్తానా(21) ఆత్మహత్య కలకలం రేపింది. -8లో



సవేరాతో సురభి

వారసత్వ రక్షణకు కృషి

సవేరా నాటక సంస్థ ద్వారా సురభి సంస్థ వారసత్వ రక్షణ కోసం కృషి చేద్దామని ప్రముఖ ఆడిటర్ ఖాసింఖాన్ అన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం

41.6/26.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం 26.2 - 41.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

22 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ)లైన డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వివింగ్,టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నోటిఫైడ్ ఎగ్జామినేషన్ సెంటర్లలో నిర్వహించనున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనూరాధ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను www.bsc.ap.gov.in లో పొందుపరిచినట్లు తెలిపారు. టీటీసీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌ల తోపాటు ప్రభుత్వం జారీ చేయబడిన ఏదైనా ఒక ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డు తీసుకుని రావాలని తెలిపారు.

టన్ను చీనీ రూ.40 వేలు



చీనీమార్కెట్‌లో వేలంపాట నిర్వహిస్తున్న రైతులు, అధికారులు

పులివెందుల రూరల్: పులివెందుల వ్యవసాయ చీనీ మార్కెట్‌లో చీనీధరలు రోజురోజుకు కొత్త రేటు పలుకుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే చీనీ టన్ను ధర రూ.35వేల నుంచి రూ.40వేలు పలకడంతో చీనీ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, పులివెందుల మండలాల్లోని గ్రామాల నుంచి రైతులు తాము పండించిన చీనీ కాయలను విక్రయాలు జరిపేందుకు పులివెందులలోని చీనీకాయల మార్కెట్‌కు తరలిస్తున్నారు. మంళవారం ఒక్కరోజు 650టన్నుల చీనీ కాయలు వచ్చాయి. అనంతపురం జిల్లాలోని చీనీకాయల మార్కెట్‌లో షూట్ ఉండడంతో ఆ ప్రాంత రైతులు కూడా పులివెందుల మార్కెట్‌కు కాయలను తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. పులివెందుల చీనీమార్కెట్‌లో ఎటువంటి షూట్ లేకపోవడంతో రైతులు చాలా మంది మార్కెట్‌కే తరలిస్తున్నారు. ఈ ప్రాంత రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో చీనీకాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. చీనీకాయల మార్కెట్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మార్కెట్‌యార్డు ఛైర్మన్ చిన్నప్ప, వైస్ ఛైర్మన్ సర్వోత్తమరెడ్డి , సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.

21న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరోతరగతి ప్రవేశం కోసం ఈనెల 21వ తేదీ ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు పొంది పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని చెప్పారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌తో పరీక్ష కేంద్రంలోకి రావాలని సూచించారు.

నియామకం





సుహేల్‌ఖాన్, పస్తం అంజిలకు నియామక పత్రాలు అందజేస్తున్న కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప నగరానికి చెందిన బేడ, బుడగ జంగం నాయకులు పస్తం అంజిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు కె. సురేష్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో నియామక పత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. రాజగోపాల్‌రెడ్డి, వీరారెడ్డి, గోవిందు నాగరాజు, సీహెచ్ సునీల్, కంచుపాటి బాబు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా సుహేల్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా కడప నగరానికి చెందిన ఏ టు జెడ్ మొబైల్స్ ప్రొప్రైటర్ మయానా సుహేల్ ఖాన్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కె సురేష్ బాబు తెలిపారు. మంగళవారం అపూర్వ కళ్యాణ మండపంలో ఆయనకు ఉత్తర్వులను అందజేశారు. తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకరించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమరానికి సిద్ధం


- రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- ఈనెల 25 నామినేషన్లకు ఆఖరి గడువు
- 26న నామినేషన్ల పరిశీలన.... 29 వరకు ఉపసంహరణ
- లోక్‌సభకు కడపలో... అసెంబ్లీలకు ఆయా నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణ
- లోక్‌సభకు రూ. 25 వేలు, శాసనసభకు రూ. 10 వేలు డిపాజిట్
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నగం చెల్లిస్తే సరి



కడప సెవెన్‌రోడ్స్ : లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 18వ తేది విడుదల కానుంది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు అదేరోజు నుంచి నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈనెల 25వ తేది నామినేషన్ల దాఖలుకు ఆఖరు గడువు. కడప లోక్‌సభ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ విజయరామరాజు వ్యవహరిస్తారు. ఏడు అసెంబ్లీ స్థానాలకు ప్రత్యేకంగా రిటర్నింగ్ అధికారులను నియమించారు. ప్రభుత్వ సెలవు దినాలు కాకుండా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారి వద్ద సమర్పించాల్సి ఉంటుంది. ఆర్వో కార్యాలయం వంద మీటర్ల పరిధిలోకి అభ్యర్థికి చెందిన మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. నామినేషన్ల సమయంలో ఆర్వో వద్దకు అభ్యర్థి సహా ఐదు మందిని మాత్రమే అనుమతిస్తారు.

అభ్యర్థులు గమనించాల్సిన ప్రధాన అంశాలు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి భారత పౌరుడై ఉండి నామినేషన్ల పరిశీలన సమయానికి 25 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. తాను భారత పౌరుడినని, రాజ్యాంగానికి, భారత సార్వభౌమాధికారానికి లోబడి నడుచుకుంటామని ప్రమాణపత్రం సమర్పించాలి. ఆదాయం వచ్చే ప్రభుత్వ పదవిలో ఉండరాదు. నేరారోపణ రుజువై ఉండరాదు. దివాళా తీసి ఉండరాదు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులై ఉండాలి. రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు ఉండవచ్చు. సొంత నియోజకవర్గం కాకుండా మరోచోట పోటీచేసే అభ్యర్థి తనకు ఓటు హక్కు ఉన్నట్లు ధృవీకరణపత్రాన్ని నామినేషన్‌తో జతపరిచి సమర్పించాల్సి ఉంటుంది. ఏ అభ్యర్థినైనా ప్రతిపాదించే వ్యక్తి అదే నియోజకవర్గ ఓటరుగా ఉండాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీ అభ్యర్థులకు ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. గుర్తింపు లేని రిజిష్టర్ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు ఉండి ఇక్కడ గుర్తింపు లేని పార్టీలకు చెందిన అభ్యర్థులకు పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది. లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థులు ఫారం-2ఏ (అనెగ్జర్-1)లో, శాసనసభకు పోటీచేసే అభ్యర్థులు ఫారం-2బి (అనెగ్జర్-2)లో తమ నామినేషన్ పత్రాలు జత చేయాలి. అభ్యర్థులు ప్రత్యేకంగా ఒక బ్యాంకు అకౌంటు ప్రారంభించాలి. తాను, తన ఎన్నికల ఏజెంట్ జాయింట్ అకౌంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. బ్యాంకు ఖాతా పుస్తకాన్ని నామినేషన్ సమయంలో రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. లోక్‌సభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు రూ. 25 వేలు, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులు రూ. 10 వేలు చొప్పున డిపాజిట్ రుసుము చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే సగం చెల్లిస్తే సరిపోతుంది. అయితే నామినేషన్ సమయంలో కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఫారం-26 (అనెగ్జర్-3)లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలతో కూడిన నోటరీ అఫిడవిట్ నామినేషన్ సమయంలోనే జతపరచాలి. నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. అఫిడవిట్‌లోని అన్ని కాలమ్స్ పూర్తి చేయాలి. ఏ ఒక్క కాలమ్ వదిలేసినా నోటీసు జారీ చేస్తారు. అప్పటికీ స్పందించకపోతే నామినేషన్ తిరస్కరిస్తారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల వరకు నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. డిపాజిట్ ఒకసారి చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్ దాఖలుకు ఆఖరి గడువు ముగిసేలోపు నాలుగు సెట్ల నామినేషన్లు ఏరోజైనా సమర్పించవచ్చు. ముఖ్యంగా అభ్యర్థులు ఓటర్ల జాబితాలో తన పేరు, ఫొటో సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి. తండ్రి, భర్త, చిరునామా, వయస్సు, ఫొటో వంటి వాటిలో తప్పు ఉంటే వెంటనే సరిచేసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. ముందుగా ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన తర్వాతే పోటీ చేసేందుకు అర్హులవుతారు. లోక్‌సభ అభ్యర్థులు రూ.95 లక్షలు, శాసనసభ అభ్యర్థులు రూ.40 లక్షల వరకు ఎన్నికల కోసం ఖర్చు చేసుకోవచ్చు.



రిటర్నింగ్ అధికారుల వివరాలు

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	సెల్ నెంబరు
బద్వేలు (ఎస్సీ)	ఎ.వెంకట రమణ	9849904125
కడప	జీఆర్ మధుసూదన్	9849904117
పులివెందుల	బీకే వెంకటేశులు	9849904111
కమలాపురం	జి.గణేష్‌కుమార్	9849904119
జమ్మలమడుగు	శ్రీనివాస్	9849904115
ప్రొద్దుటూరు	కౌసర్‌భాను	9494390993
మైదుకూరు	చంద్రమోహన్	9440340899

ప్రశాంతంగా శ్లాస్ పరీక్ష

- జిల్లావ్యాప్తంగా 3724 మంది విద్యార్థులు హాజరు
- 98.86 శాతం హాజరు నమోదు



కడపలోని పరీక్షా కేంద్రంలో విద్యార్థితో మాట్లాడుతున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడవ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సామర్థ్యాలను అంచనా వేసేందుకు మంగళవారం ఎస్‌సిఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్లాస్ (స్టేట్ లర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులంతా నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఈ పరీక్షను జిల్లాలోని 23 మండలాల పరిధిలో 121 పాఠశాలలకు చెందిన 4010 మంది విద్యార్థులకు నిర్వహించారు. కాగా 3724 మంది విద్యార్థులు హాజరై 98.86 శాతం హాజరు నమోదైంది. సంబంధిత శ్లాస్ పరీక్షను ఎంఈఓల పర్యవేక్షణలో సీఆర్‌పీలు నిర్వహించారు. ఈ శ్లాస్ పరీక్షకు ఎక్కడ ఎలాంటి సమస్య లేకుండా ప్రశాంతంగా జరిగింది.

విద్యార్థుల సామర్థ్యాల అంచనా కోసమే శ్లాస్ పరీక్ష

విద్యార్థుల్లో సామర్థ్యాలను అంచనా వేసేందుకే శ్లాస్ పరీక్షను నిర్వహించామని డీఈఓ మర్రెడ్డి అనురాధ పేర్కొన్నారు. మంగళవారం కడపలోని కాగితాలపెంట, ఇందిరానగర్ మండల ప్రాథమిక పాఠశాలతోపాటు సీకెదిన్నె మండలంలోని పలు పాఠశాలలను డీఈఓ తనిఖీ చేసి పరీక్ష నిర్వహణను పరిశీలించడంతోపాటు వసతులపై విద్యార్థులతో ఆరా తీశారు. అలాగే డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య, ఏఎంఓ ధనలక్ష్మి, ఎంఈఓలు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్ కడప నగరంతో పాటు జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉరుసు బుక్‌లెట్ విడుదల



ఉరుసు మహోత్సవ బుక్‌లెట్లు విడుదల చేస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇమ్రాన్, షేక్ ఇస్మాయిల్

కమలాపురం: దక్షిణ భారతదేశంలోనే ఘనంగా నిర్వహించే స్థానిక దర్గా-ఏ-గఫారియా, ఖాదరియా ఉరుసు ఉత్సవాల బుక్‌లెట్లను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ ఇమ్రాన్ విడుదల చేశారు. మంగళవారం స్థానిక ఆ దర్గాలో పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రీ సోదరుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్‌తో కలసి ఆయన బుక్‌లెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాలకు గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నుంచి చాదర్ సమర్పణ తదితర కార్యక్రమాలు ప్రొటోకాల్ ప్రకారం నిర్వహించామన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వం తరపు నుంచే ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు చాదర్ సమర్పణ తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. పీఠాధిపతి దివ్య ఆశీస్సులతో ఉరుసు జరిగే నాలుగు రోజుల్లో విద్యుత్, ఫైర్, మెడికల్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు తమ సేవలు నిరంతరాయంగా అందించాలని ఆయన కోరారు. దర్గా యూత్ షరీఫ్, గఫార్, ఫయాజ్, ఇబ్రహీం, మస్తాన్‌వల్లి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా కమాండ్ సెంటర్ సేవలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ సేవలను పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వెళ్లే ప్రతి రిపోర్టును భద్రపరచుకోవాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లను అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పనిని విధిగా చేపట్టాలన్నారు. కంట్రోల్ రూమ్ సిబ్బందికి ప్రణాళిక ప్రకారం షిఫ్ట్‌ల డ్యూటీలను కేటాయించి.. నిత్యం మానిటర్ చేయాలని, రిపోర్టులను సకాలంలో అందించాలన్నారు.



ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

మున్సిపల్ కమీషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ , ఎంసీఎంసీ, సీజర్స్, ఎక్స్పెండెచర్ మానిటరింగ్ కమిటీల నోడల్ అధికారులు, సోషల్ మీడియా సెల్ కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంతో గ్రామాల మధ్య పెరిగిన కనెక్టివిటీ

పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాసులురెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: గ్రామాల మధ్య కనెక్టివిటీ పెంచాలన్న ఉద్దేశ్యంతో జిల్లాలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద రహదారి నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పీఎంజీఎస్‌వై ఫేస్-3 కింద రూ. 557.18 లక్షల అంచనా వ్యయంతో బిదినంచర్ల నుంచి చెర్లోపల్లె, హిమకుంట్ల మీదుగా మండల కేంద్రమైన సింహాద్రిపురంకు 10.10 కిలోమీటర్ల పొడవున రహదారి నిర్మాణం పూర్తయింది. పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి మంగళవారం తన సిబ్బందితో కలిసి మంగళవారం సందర్శించారు. ఇంతవరకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రహదారి నిర్మాణానికి స్థల సేకరణ కూడా పెద్ద సమస్యగా ఉండేది. ఈ అంశాన్ని ఎస్‌ఈ శ్రీనివాసులురెడ్డి కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవ తీసుకుని ప్రజలతో మాట్లాడటంతో స్థల సేకరణ సమస్య పరిష్కారమైంది. దీంతో అనుకున్న సమయంలో రహదారి నిర్మాణం పూర్తయింది. ఇందువల్ల ముఖ్యంగా విద్యార్థులతోపాటు రైతులు, వ్యవసాయ కూలీలకు ఎంతో సౌలభ్యంగా మారింది. మంగళవారం రహదారిని సందర్శించిన ఎస్‌ఈ వివిధ వర్గాల ప్రజలతో మాట్లాడారు. రహదారి నిర్మాణం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



గ్రామీణ ప్రజలతో మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాసులురెడ్డి

జిల్లాకు నవమి శోభ

- ఉత్సాహభరితంగా ఏర్పాట్లు
- కల్యాణానికి వేదికలు సిద్ధం

కడప కల్చరల్: సకల సద్గుణాలకు మారురూపుగా, మానవాళికి ఆదర్శంగా అపురూపమైన బంధాలకు ఆలవాలంగా నిలిచిన శ్రీరాముడు జన్మించిన శుభదినం. ఆయన సీతారాముడయ్యే శుభలగ్నం వెరసి బుధవారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా అంతటా రామాలయాలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయి. కేవలం రామాలయాలే కాకుండా దాదాపు అన్ని వైష్ణవాలయాలలో కూడా ఈ వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో వచ్చే శ్రీరామ నవమి పండుగకు ప్రత్యేకత ఉంది. సీతారాముల కల్యాణం పేరిట ఓ శుభ కార్యానికి బంధుమిత్రులు, ఇరుగుపొరుగులతో కలిసి రెండు గంటలపాటు ఒకేచోట కలిసి ఉండే అపురూపమైన ఈ అవకాశం శ్రీరామనవమి ఇస్తోంది. జిల్లాలో చిన్న, పెద్ద రామాలయాలు, వైష్ణవాలయాలు దాదాపు 4 వేలకు పైగా ఉన్నాయి. ఉదయం 9.00 నుంచి 12.30 గంటల్లోపుగా ఆయా ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఆయా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక వేదికలను సిద్ధం చేశారు. ఆలయాల్లో కల్యాణ అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులందరికీ కల్యాణ విందు ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న శ్రీరాముని విగ్రహం

వసంత నవరాత్రులు

కడపలోని పలు వైష్ణవాలయాల్లో ఉగాది నుంచి వసంత నవరాత్రుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ప్రతిరోజు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నవమి రోజున శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం లోపుగా కల్యాణాలు, సాయంత్రం 6 గంటల నుంచి నగరోత్సవాలు నిర్వహించేందుకు రథాలు, పల్లకీలు సిద్ధం చేసుకుంటున్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన



పోలీస్ అధికారులకు భద్రతా ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 22న నిర్వహించనున్న సీతారాములవారి కళ్యాణం సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ మంగళవారం పరిశీలించారు. సీతారాముల కల్యాణానికి పలువురు ప్రముఖులు రానున్న నేపథ్యంలో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రించాలన్నారు. ఒంటిమిట్టలోని కోదండరామాలయం, కళ్యాణ వేదిక, తదితర ప్రాంతాలలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రత పర్యవేక్షించేలా పోలీస్ అధికారులకు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు.

మోహినీరూపం.. భక్తుల పరవశం

వాల్మీకిపురం: అన్నమయ్య జిల్లాలో ప్రసిద్ధి చెందిన వాల్మీకిక్షేత్రంలోని శ్రీ పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం రాత్రి 8 గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో తేజోమూర్తిగా మురిపిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటలకు చంద్రప్రభవాహనంపై స్వామివారు తేజోమూర్తిగా తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. సూర్యప్రభ వాహన సేవ అనంతరం 10 గంటల నుంచి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల సేవ జరిగింది. రాత్రి 8గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో శ్రీరామచంద్రుడు భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో ఊరేగుతున్న స్వామివారికి మహిళలు నేతి దీపాలతో తిరుమాడ వీధుల్లో స్వాగతం పలికారు.



మోహినీ అవతారంలో మురిపిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

కడప మీదుగా తివేంద్రంకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కాచిగూడ నుంచి త్రివేంద్రం కొచ్చివేలికి కడప మీదుగా ప్రత్యేక రైలు (07229/07230)ను నడపనున్నారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. కాచిగూడ నుంచి తివేంద్రం కొచ్చివేలికి ఈనెల 18, 25 తేదీల్లో బయలుదేరుతుందన్నారు. ఉదయం 6.05 గంటలకు ఈ రైలు కాచిగూడలో బయలుదేరి మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, ఎర్రగుంట్ల మీదుగా కడపకు మధ్యాహ్నం 2.25 గంటలకు చేరుతుందన్నారు. అలాగే కడప నుంచి రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుపూరు, కోయంబత్తూరు, త్రిశూర్, ఎర్నాకులం టౌన్, కొట్టాయం , చెంగనూరు, కొల్లాం మీదుగా తివేంద్రం కొచ్చివేలికి మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 19, 26 తేదీలలో కొచ్చివేలిలో మధ్యాహ్నం 12.50 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో శనివారం ఉదయం 6.25 గంటలకు కడపకు చేరుతుందని వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ జూనియర్ విభాగం బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపికల చైర్మన్ సి. శ్రీనివాసరెడ్డి, సభ్యులు శ్రీనివాసులు, వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నూజివీడులో నిర్వహించనున్న 9వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. **జిల్లా బాలికల జట్టు :** రిజ్వానా, చంద్రిక, యశశ్విని, రెడ్డిసాయి, చంద్రమౌనిక, నందిని, మొబీ, వెంకటమౌనిక, అఫ్రీన్, వినూత్న, భవిత, అనిత. రోహిత(కోచ్), సుబ్బమ్మ (మేనేజర్) **జిల్లా బాలుర జట్టు :** తమన్, కిశోర్, విజయభాస్కర్, తేజ, వినీల్‌కుమార్‌రెడ్డి, హిమవరాహన్‌రెడ్డి, శివ, నితిన్, మణికంఠ, జీవన్, జశ్వంత్, వివేక్. శ్రీకాంత్ (కోచ్), నాగార్జున (మేనేజర్).

యువకులపై హత్యాయత్నం

కడప అర్బన్ : కడప నగరం కో–ఆపరేటివ్ కాలనీలో జీవీఆర్ టవర్స్ సమీపంలో ఈనెల 15వ తేదీ రాత్రి సోను (26), సుజిత్(29)లపై ముగ్గురు యువకులు కత్తితో దాడి చేశారు. సంజయ్, రాహుల్‌లు ఇమ్రాన్ అనే వ్యక్తితో గొడవపడ్డారు. ఈ క్రమంలో సుజిత్ అనే వ్యక్తికి సంబంధించిన మోటార్ సైకిల్‌ను కాల్చివేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించిన సుజిత్, అతని స్నేహితుడు సోనుపై సంజయ్ రాహుల్, హాజీ, శ్రీకాంత్‌లు హత్యాయత్నానికి పాల్పడ్డారు. సుజిత్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్ రెడ్డి తెలిపారు.

క్షణికావేశం.. యమపాశం..!

- యువత తొందరపాటు నిర్ణయాలతో తల్లిదండ్రుల కలవరపాటు
- వారం రోజుల వ్యవధిలో నలుగురు విద్యార్థుల ఆత్మహత్య
- చావు పరిష్కారం కాదంటున్న నిపుణులు

వారం క్రితం సిద్దవటంలో పాలెం రెడ్డిరామ్మోహన్.. ఆదివారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థిని సురేఖ.. సోమవారం రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థిని రాణి మహంక... తాజాగా యోగివేమన విశ్వవిద్యాలయంలో పీజీ బయోటెక్నాలజీ విద్యార్థిని సుల్తానా.. ఇలా.. ఒక్కొక్కరు క్షణికావేశంలో ప్రాణం తీసుకుని కన్నవారికి తీరని శోకం మిగులుస్తున్నారు. తొందరపాటుగా తీసుకున్న నిర్ణయం వారి కుటుంబాల పాలిట అశనిపాతంలా మారుతోంది. వారం రోజుల వ్యవధిలో జిల్లాలో వరుసగా నలుగురు ఆత్మహత్య చోటుచేసుకోవడం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది. 'అర్థం చేసుకుంటే కోపం కూడా అర్థవంతమైనదే'.. అలాంటిది చిన్నచిన్న విషయాలకే ప్రాణం తీసుకునేలా వ్యవహరించడం సరికాదని మనోవిజ్ఞానశాస్త్ర నిపుణులు సూచిస్తున్నారు.



వైవీయూలో విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన ఎస్. షమ్మా సుల్తానా

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం పీజీ బయోటెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎస్. షమ్మా సుల్తానా(21) ఆత్మహత్య కలకలం రేపింది. ఇటీవల వరుస సెలవులు రావడంతో తన స్వగ్రామమైన కదిరి పట్టణానికి వెళ్లి సెలవుల అనంతరం సోమవారం విశ్వవిద్యాలయానికి చేరుకుంది. అనంతరం మంగళవారం యథావిధిగా కళాశాలలో తరగతులకు హాజరైన ఆమె అరగంట ముందుగా క్లాస్‌లో నుంచి హాస్టల్‌కు వెళ్లిపోయినట్లు తోటి విద్యార్థులు పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో తోటి విద్యార్థినులు మెస్‌కు భోజనం చేసేందుకు వెళ్లిన సమయంలో మహిళల వసతి గృహంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే అప్రమత్తమైన తోటి విద్యార్థినులు, సిబ్బంది సమాచారం అధికారులకు అందించి, హుటాహుటిన ఆమెను రిమ్స్‌కు తరలించారు. విద్యార్థిని వెంట విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి వెళ్లడంతో పాటు వారి తల్లిదండ్రులకు, పోలీసులకు వెంటనే సమాచారాన్ని అందించారు. కాగా సుల్తానా రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచింది. కాగా రిమ్స్‌కు కడప డీఎస్పీ షరీఫ్ చేరుకుని వైవీయూ అధికారులతో మాట్లాడటంతో పాటు తోటి విద్యార్థినులతో మాట్లాడి వివరాలను సేకరించారు. వైవీ యూ అధికారుల సమాచారంతో పెండ్లిమర్రి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి 174 సెక్షన్ కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. కాగా విద్యార్థిని మృతదేహాన్ని అధ్యాపకులు, విద్యార్థి సంఘ నాయకులు పరిశీలించారు.

చిన్న చిన్న విషయాలకే..

పరీక్షలు తప్పామనో.. కోరుకున్నది జరగలేదనో.. ప్రేమ విఫలమైందనో.. తల్లిదండ్రులు తిట్టారనో.. ఇలా చిన్నచిన్న కారణాలకే విచక్షణ కోల్పోయి క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు వారి కుటుంబాలకు తీరని వేదనను మిగుల్చుతున్నాయి. పరీక్షలు ఫెయిలైతే.. మరోసారి రాసుకుని పాస్ కావచ్చు.. ఎందరో చదువులో విఫలమైనా జీవితంలో విజేతలుగా నిలిచినవారు ఉన్నారన్న విషయం గుర్తుంచుకోవాలి. యవ్వనంలో ఉంటే ఆకర్షణ, ప్రేమల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రేమపేరుతో జరిగే మోసాలకు బలవడం కాకుండా.. మిమల్ని ఎంతగానో ప్రేమించే మీ కుటుంబ సభ్యులను గుర్తుచేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, పరిష్కారం లేని సమస్య లేదన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని సైకాలజిస్టులు పేర్కొంటున్నారు.కారణాలేవైనా చావు పరిష్కారం కాదని, బతికి సాధించాలని, జీవితంలో ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలని చెబుతున్నారు. విద్యాసంస్థల్లో సైకలాజికల్ కౌన్సిలర్‌లను ఏర్పాటు చేయాలన్న నిబంధనను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

క్షణికావేశ నిర్ణయాలు సరికాదు



ప్రతిరోజూ ఏదో ఒకచోట విద్యార్థుల ఆత్మహత్యల వార్తలు వస్తుండటం ఆందోళన కలిగించే అంశం. కారణాలేవైనా విద్యార్థులు క్షణికావేశంలో చనిపోవాలనే నిర్ణయం సరికాదు. సమస్య గురించి రెండు నిమిషాలు ఆలోచించడం, సన్నిహితులతో చర్చించడం ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుంది. తద్వారా చెడు ఆలోచనలు తొలగిపోతాయి. చనిపోవాలనుకున్న సమయంలో కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకుంటే ఇలాంటి ఘటనలు చేయాలన్న ఆలోచనలు రావు. విద్యకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్భయంగా చర్చించాలి. సున్నిత మనస్కులను తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలి. ఏవైనా వారిలో మార్పులు కనిపిస్తే కచ్చితంగా అడిగి తెలుసుకోవాలి. సాధించాలన్న పట్టుదల ఉండాలే తప్ప చచ్చి సాధించేదేమీ ఉండదన్న విషయం గుర్తించాలి. – **డాక్టర్ కె. లలిత,** మనోవిజ్ఞానశాస్త్ర విభాగాధిపతి, వైవీయూ

ప్రతి సమస్యకు పరిష్కారం ఉందని గుర్తించాలి



ప్రతి సమస్యకు పరిష్కారం ఉందన్న విషయం విద్యార్థులు గుర్తించాలి. అదే విధంగా అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్న విషయం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గుర్తించాలి. విద్యార్థులపై అనవసర ఒత్తిడి పెట్టకూడదు. మంచి చెడులు తెలుసుకునే మంచి పౌరునిగా తయారయ్యేలా తల్లిదండ్రుల పెంపకం ఉండాలి. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన వచ్చిన కొద్ది నిమిషాల పాటు సంయమనం పాటించడం, తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులతో చర్చిస్తే చెడు సమయం వెళ్లిపోతుంది. చావు ఎప్పటికీ పరిష్కారం కాదు.. ప్రతి దానికి ప్రత్యామ్నాయం ఉందన్న విషయం తెలుసుకోవాలి. భావోద్వేగాలను నియంత్రించుకోవాలి. – **డాక్టర్ లాజరస్,** మనోవిజ్ఞానశాస్త్ర సహ ఆచార్యులు,వైవీయూ

ఉఠో.. బేటీ.. సుల్తానా.!



రిమ్స్ మార్చురీలో తన కుమార్తె సుల్తానా మృతదేహాన్ని పట్టుకుని విలపిస్తున్న తల్లి

కడప అర్బన్ : ఉఠో బేటీ సుల్తానా... అంటూ తన కుమార్తె మృతదేహాన్ని పట్టుకుని తల్లి షమీరా బోరున విలపించిన దృశ్యం అందరిని కంట తడి పెట్టించింది. రంజాన్ పండుగకు ఇంటికి వచ్చి అందరితో సరదాగా గడిపిన షమ్మా సుల్తానా (22) ఇంటి నుంచి వచ్చిన 24 గంటల్లోపే విగతజీవిగా మారడంతో తల్లి మనసు తల్లడిల్లిపోయింది. తల్లిదండ్రులు షమీరా, హఫీజ్‌లకు షమ్మా సుల్తానా ఏకైక కుమార్తె. ఆమె కన్నా చిన్నవాడైన కుమారుడు ఉన్నాడు. తండ్రి హఫీజ్ గత కొన్ని సంవత్సరాలుగా గల్ఫ్‌లో ఉన్నారు. ఆయనతో కుటుంబ సభ్యులంతా ఫోన్ ద్వారా సరదాగా మాట్లాడి క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. హాయిగా పండుగ చేసుకున్నారు. పండుగ తరువాత సోమవారం కదిరి నుంచి వైవీయూకు సుల్తానా వచ్చింది. మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనతో వైవీయూలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనపై కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్, కడప రూరల్ సీఐ నాగరాజు, సిబ్బంది సమగ్రంగా విచారిస్తున్నారు.

వైవీయూ అధికారుల దిగ్భ్రాంతి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం విద్యార్థిని ఎస్. సుల్తానా మృతి పట్ల వైవీయూ అధికారులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు తరగతి గదిలో తోటి విద్యార్థులతో కలిసి పాఠాలు విన్న విద్యార్థి అంతలోనే వసతిగృహంలో బలవన్మరణానికి పాల్పడటం విశ్వవిద్యాలయంలో కలచివేసింది. కాగా విద్యార్థి మృతితో ఆందోళన చెందుతున్న విద్యార్థినులకు వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి వెళ్లి ధైర్యం చెప్పారు. విశ్వవిద్యాలయ అధికారులు అన్ని వేళలా అందుబాటులో ఉంటారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. కాన్ఫరెన్స్ నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విద్యార్థిని మృతి విషయం తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

సుల్తానా ఆత్మహత్యపై న్యాయ విచారణ జరపాలి

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలో మంగళవారం పీజీ విద్యార్థిని సుల్తానా ఆత్మహత్య సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కో కన్వీనర్ ఎంఆర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు రిమ్స్‌లో మృతదేహాన్ని సందర్శించి విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు సమగ్ర విచారణ జరిపి ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తులెవరో తేల్చి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

'సవేరా'తో సురభి వారసత్వ రక్షణకు కృషి



రంగస్థల కళాకారులకు ఇంటాక్ సత్కారం

సంస్థ మూలనిధి కోసం రూ. 1,16,000 అందజేత

కడప కల్చరల్ : సవేరా నాటక సంస్థ ద్వారా సురభి సంస్థ వారసత్వ రక్షణ కోసం కృషి చేద్దామని సీనియర్ కళాకారుడు, ప్రముఖ ఆడిటర్ లయన్ కె.ఖాసింఖాన్ అన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ(ఇంటాక్) ఆధ్వర్యంలో మంగళవారం రంగ స్థల కళాకారులను సత్కరించారు. స్థానిక గ్రాండ్‌ఇన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఖాసింఖాన్ మాట్లాడుతూ సవేరా సంస్థకు ఊపిరిలాంటి ఆళ్లారి వెంకటయ్య కృషి ప్రశంసనీయమన్నారు. ఆయన పేరిట సవేరా సంస్థకు తాను రూ. 1,16,000 మూలనిధి చెక్కును సంస్థ నిర్వహణ, అభివృద్ధి కోసం ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డికి అందజేశారు. చిన్నపరెడ్డి మాట్లాడుతూ సవేరా సంస్థ నిర్వహణ బాధ్యతను సంస్థ చైర్మన్ వెంకటయ్య కోరిక మేరకు ఇంటాక్ సంస్థ స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సవేరా వెంకటయ్య మాట్లాడుతూ తన తర్వాత కూడా సంస్థ జవజీవాలతో రాణించాలన్న కోరిక ఉందని, ప్రధానంగా రామాయణాన్ని మూడు రోజులపాటు నాలుగు భాగాలుగా ప్రదర్శించాలన్నది చిరకాల వాంఛ అన్నారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రంగస్థల కళాకారుల వివరాలతో సమగ్రమైన పుస్తకాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేద కళాకారులకు పెన్షన్, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, లయన్ యద్దుల చిన్నప్పరెడ్డి, సంజీవరెడ్డి, రాణి, భారవి, గౌరీశంకర్, గంగాధర్, నాగవేణి, అరుణ, వెల్లాల వెంకటేశ్వరాచారి, రాఘవేంద్రవర్మ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కడప, ప్రొద్దుటూరు, ఇతర ప్రాంతాలకు చెందిన పదిమంది సీనియర్ రంగస్థల కళాకారులను ఇంటాక్ ఆధ్వర్యంలో సత్కరించి నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు నాటకాల్లోని పద్యాలను ఆలపించి అలరించారు.

మేము కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలమా? ఉపాధి కూలీలమా?

కమలాపురం : 'మేము కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలమా? లేక ఉపాధి పని కూలీలమా? కాంగ్రెస్ పార్టీ పెద్దలు మాకు న్యాయం చేయాలి' అంటూ కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ నేత పాట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. కమలాపురంలో ఇండియా కూటమి నేతలు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశం మధ్య లేచి చంద్రశేఖర్ రెడ్డి తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఇండియా కూటమి నేతలు తులసిరెడ్డి, జి.ఈశ్వరయ్య, గాలి చంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



చెన్నూరు : మండలంలోని చిన్న మాచుపల్లె రెవెన్యూ పరిధిలోని శాటిలైట్ సిటీ వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని యువకుడు (30) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మృతుడు ఉదయం 6.00 గంటల సమయంలో మద్యం మత్తులో అక్కడే తూలుతూ తిరుగుతూ ఉన్నాడన్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ కార్యక్రమంలో జెడ్‌బీఎన్‌ఎఫ్ ఉద్యోగి



టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటయ్య (వృత్తంలో ఉన్న వ్యక్తి)

మైదుకూరు : మైదుకూరు మండలం తువ్వపల్లె పంచాయతీలో మంగళవారం టీడీపీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ (జెడ్‌బీఎన్‌ఎఫ్) విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి పాల్గొన్నారు. తువ్వపల్లె ఎస్సీ కాలనీకి చెందిన పలు కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. ఆ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాలువపల్లె వెంకటయ్య అనే వ్యక్తి పాల్గొనడం గమనార్హం. చెన్నూరులో ప్రకృతి వ్యవసాయం విభాగంలో వెంకటయ్య ఎల్–2 ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న వారు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినా వెంకటయ్య టీడీపీ కార్యక్రమంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజును వివరణ కోరగా, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నవారు, రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్నారు. వెంకటయ్యపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, అతనిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గువ్వలచెరువు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ మూడవ మలుపు వద్ద లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో మరో వాహనంపై బోల్తా పడింది. సీకే దిన్నె అప్‌గ్రేడ్ సీఐ శంకర్ నాయక్ తెలిపిన వివరాల మేరకు... రాయచోటి నుంచి కడపకు వస్తున్న బొగ్గుల లోడు లారీ సరిగ్గా గువ్వలచెరువు ఘాట్ మూడవ మలుపు వద్దకు రాగానే బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ఎదురుగా వస్తున్న మరో వాహనంపై పడింది. మరో వాహనంలో ఇరుక్కున డ్రైవర్‌ను క్రేన్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది వెలికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రమాద దృశ్యం, వాహనంలో ఇరుక్కున్న వ్యక్తి